క్లుప్తంగా

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



తుంగతుర్తి సబ్‌స్టేషన్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యుత్ కార్మికులు

తుంగతుర్తి : ఈ నెల 14 నుంచి చేపట్టనున్న విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని టీవీఏసీ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముసిగుంపుల యాకయ్య, సబ్ డివిజన్ అధ్యక్షుడు అండెం రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో సమ్మె కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టిజన్ అని ఓ ముద్దు పేరు పెట్టి కార్మికులను నట్టేట ముంచి పోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆర్టిజన్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నీలం సైదులు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కొమ్ము లింగమూర్తి, మల్లేష్, జి.వెంకన్న, ఎల్లయ్య, ధనమ్మ, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాగారం : వర్ధమానుకోట గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఇంటర్మీడియట్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయినందున 2025–26 విద్యా సంవత్సరానికిగానూ పీజీ సీఆర్‌టీ ఫిజిక్స్, ఎమ్ఎల్‌టీ సబ్జెక్టులు బోధించుటకు పీజీ, బీఈడీ అర్హతలు కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేజీబీవీలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్‌టీ ఫిజిక్స్, ఎమ్ఎల్‌టీ సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే పసునూర్ మోడల్ స్కూల్‌లోని బాలికల వసతి గృహంలో అసిస్టెంట్ కుక్, కేజీబీవీలో అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అసిస్టెంట్ కుక్‌కు 7వ తరగతి, అటెండర్‌కు 10వ తరగతి విద్యార్హత ఉండాలన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో మెసెంజర్‌కు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు వర్ధమానుకోటలోని కేజీబీవీ ప్రత్యేక అధికారికి అందించాలని సూచించారు.

12న సంస్మరణ సభ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామానికి చెందిన భారత విప్లవోద్యమ రథసారథులు దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు (డీవీ), తరిమెల నాగిరెడ్డి (టీఎన్) సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం యూసీసీఆర్ఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో గ్రామంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అక్కలదేవిగూడెం గ్రామ శివారులో ఈ నెల 12న డీవీ స్మారక సమాధి వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నల్లగొండ వెంకన్న, భాష్పంగు సునీల్, మాజీ ఎంపీటీసీ కోడి బండ్లయ్య, ఉప్పల మల్లయ్య, నల్లగొండ లింగయ్య, రాణి, వెంకటేష్, మధుసూదన్, సుమన్, భిక్షం, చంద్రయ్య, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి సంత వేలం

తుంగతుర్తి : తుంగతుర్తిలో ప్రతి సోమవారం నిర్వహించే సంతకు మంగళవారం గ్రామ పంచాయతీ పరిధిలో తహసీల్దార్ దయానందం వేలంపాట నిర్వహించారు. రూ.5లక్షల 50వేలకు తుంగతుర్తికి చెందిన పెండెం వెంకన్న వేలం దక్కించుకున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే సంతకు వేలం పాటను మూడు సార్లు నిర్వహించినా ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వాయిదా పడగా మంగళవారం రూ.5.50 లక్షలకు పాట పాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, గ్రామపంచాయతీ సిబ్బంది, పాటదారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన

తుంగతుర్తి : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ లింగమూర్తి అన్నారు. మంగళవారం తుంగతుర్తి మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిక్షయ్ శివిర్ 2.0 క్యాంపు ద్వారా గ్రామంలో 60 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓలు తాడూరి వెంకన్న, రవికుమార్, డీటీఆర్ టీబీ కోఆర్డినేటర్ ప్రసాద్, డీఈఓ మాధవరెడ్డి, కిరణ్ కుమార్, వైద్యసిబ్బంది గాజుల సోమన్న, యాదగిరి, నరసింహ చారి, ఏఎన్ఎం స్వాతి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకట్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.



గొట్టిపర్తిలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ లింగమూర్తి

ఆగిన పనులు.. అందని వసతులు

- మన ఊరు మన బడిలో పూర్తికాని మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్డు నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న నెమ్మికల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు



అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్డు

ఆత్మకూర్(ఎస్) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన ఊరు మనబడి పథకం కొన్నిచోట్ల ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని తెలుస్తోంది. మండల పరిధిలోని నెమ్మికల్ ప్రాథమిక పాఠశాలలో ఈ పథకం కింద నిధులు మంజూరైనా పనులు అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం ఈ పాఠశాలకు పదిహేను లక్షల రూపాయలు మంజూరయ్యాయి. విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరు మరుగుదొడ్ల నిర్మాణం, మధ్యాహ్న భోజనం వంటలు చేసేందుకు ఏజెన్సీ నిర్వాహకులకు ఇబ్బందులు లేకుండా కిచెన్ షెడ్డు ఏర్పాటు, అలాగే పాఠశాల ప్రహరీకి మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపారు.

నిలిచిపోయిన పనులు..

నిధులు మంజూరు కావడంతో పాఠశాలలో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్డు నిర్మాణాలను వెంటనే ప్రారంభించారు. కానీ ఆ పనులు నేటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. దీంతో విద్యార్థులు నిత్యం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు పూర్తి కాకపోవడంతో అత్యవసర సమయాల్లో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కిచెన్ షెడ్డు నిర్మాణం కూడా మధ్యలోనే నిలిచిపోవడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారు వంటలు చేసేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

త్వరగా పూర్తిచేయాలని..

పాఠశాలలో మనఊరు మన బడి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి మరుగుదొడ్ల నిర్మాణాన్ని, కిచెన్ షెడ్డు పనులను పూర్తి చేసి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే ఇంకా చాలామంది విద్యార్థులు చేరే అవకాశం ఉందని, దీనివల్ల ప్రభుత్వ విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బిల్లులు రాలేదు



మన ఊరు మన బడి పథకంలో భాగంగా పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరుగుదొడ్లతోపాటు కిచెన్ షెడ్డు నిర్మాణాలను చేపట్టాము. అయితే చేసిన పనులకు సంబంధించి నేటికీ బిల్లులు రాలేదు. దీంతో కొన్ని పనులు మిగిలిపోయాయి. బిల్లులు విడుదల చేస్తే వెంటనే పనులను పూర్తిచేస్తాం. విద్యార్థులకు, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– గంపల సతీష్, మాజీ సర్పంచ్

ఘనంగా వైఎస్సార్ జయంతి



సూర్యాపేట జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులు

సూర్యాపేట : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద మంగళవారం జిల్లా మైనార్టీ నాయకుడు, వైఎస్సార్ అభిమాని ఎస్ఎస్ సాజిద్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ అమలవుతున్నాయని అన్నా రు. త్వరలో సైకిల్ యాత్ర చేస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండీ గౌస్, వసీం, రహీం, కిరణ్, రవీందర్ రెడ్డి, కనుకు ప్రసాద్, మైబెల్లి, రియాజ్, కత్తి వెంకన్న, సీహెచ్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అభిమాని సాజిద్‌ఖాన్

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

సూర్యాపేట : రాజ్యాంగ పరిరక్షణకు యువత ఉద్యమించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. రాజ్యాంగంలో సెక్యులరిజం, సోషలిజం అనే పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ నేత దత్తాత్రేయ వ్యాఖ్యానించడం రాజ్యాంగం రద్దు చేయడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్రలో అంతర్భాగమని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు మౌలానా ముఫ్తీ అస్రార్ సాహెబ్, బంటు కృష్ణ, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బోయిల్ల అఖిల్, బొల్లెద్దు వినయ్, చెవుల నాగరాజు, సీనియర్ దళిత నాయకుడు కొండగడుపుల సూరయ్య, దుబ్బ రమేష్, కత్తి వెంకటేశ్వర్లు, వీర బోయిన రవి, దనియాకుల శ్రీకాంత్, టేకుల సుధాకర్, నందిపాటి సతీష్, తక్కెళ్లపల్లి శ్యామ్, సుంచు నరసింహ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

10న సమీక్షా సమావేశం

నూతనకల్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 10న నిర్వహించే యువజన కాంగ్రెస్ సమీక్షా సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమీక్షా సమావేశానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. పార్టీ కార్యక్రమాలపై నిర్వహించే సమీక్షా సమావేశానికి ప్రతి గ్రామం నుంచి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, బూత్‌స్థాయి అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

నాగారం : సూర్యాపేటలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ నెల 10న జరిగే జిల్లా స్థాయి యువజన కాంగ్రెస్ సమీక్షా సమావేశాన్ని విజయవంతం చేయాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాకుబ్‌వలీ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

సూర్యాపేట : 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం పట్టణంలోని 33వ వార్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్షాకాలంలో నీటి నిల్వలతో దోమలు పెరిగి డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉందని తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యాపార ప్రదేశాల్లోని తడి, పొడి, హానికర చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని కోరారు. అలాగే వీధుల్లో సంచరించే కుక్కలకు బెల్టులు వేసి, టీకాలు వేయించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా శిథిల భవనాల్లో నివసించొద్దని సూచించారు. పరిశుభ్రతను అలవర్చుకుంటే అనారోగ్య సమస్యలు దరిచేరవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్రలు

- పటేల్ రమేష్‌రెడ్డి



మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేట : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణకు పెట్టుబడులు తెచ్చే విధంగా కృషి చేస్తుంటే.. బీఆర్‌ఎస్ నాయకులు మాత్రం రాష్ట్ర ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి మూడు లక్షల కోట్ల పెట్టుబడులు, యువతకు 60 వేల ఉద్యోగాలు, పేదలకు సన్న బియ్యం, బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లు జమ చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతితోపాటు ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్‌ఎస్ నాయకులు జైలుకుపోవడం ఖాయమన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని తెలిపారు. ఇటీవల కేటీఆర్ భాష ప్రజలు జీర్ణించుకునే విధంగా లేకుండా పోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, పీసీసీ అధికార ప్రతినిధి ధరావత్ వెంకన్న నాయక్, ముదిరెడ్డి రమణారెడ్డి, పిల్లల రమేష్ నాయుడు, కుంచం అంజయ్య, వల్దాస్ దేవేందర్, నిమ్మల వెంకన్న పాల్గొన్నారు.

వైభవంగా సీత్లాభవాని పండుగ

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని పలు తండాల్లో గిరిజనులు సీత్లా పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సీత్లాభవాని పాటలు పాడుతూ దప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ అమ్మవార్ల వద్దకు చేరుకొని నైవేద్యం సమర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



నాస్యతండాలో వేడుకల్లో పాల్గొన్న మహిళలు



నూతనకల్ : రేగడితండాలో..



అర్వపల్లి : రామన్నగూడెంతండాలో..



నూతనకల్ : బక్కహేమ్లాతండాలో వేడుకల్లో పాల్గొన్న గిరిజన మహిళలు



ఆత్మకూర్(ఎస్) : బోర్యాతండాలో నైవేద్యం తీసుకువెళ్తున్న మహిళలు



అర్వపల్లి : నాస్యతండాలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



అర్వపల్లి : సూర్యానాయక్‌తండాలో..



అర్వపల్లి : తూర్పుతండాలో..

ఏడాది కాలంలోనే ఎంతో అభివృద్ధి



రమేష్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న నాయకులు

సూర్యాపేట : తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేష్ రెడ్డి సంవత్సర కాలంలోనే ఎంతో అభివృద్ధి చేశారని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గట్టు శ్రీనివాస్ గుప్త తెలిపారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక కృష్ణా కాలనీలోని పటేల్ రమేష్ రెడ్డి నివాసంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో పటేల్ రమేష్ రెడ్డి కార్పొరేషన్ పదవి చేపట్టి తెలంగాణను టూరిజం హబ్‌గా మారుస్తున్నారని కొనియాడారు. పురాతనమైన ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధితోపాటు సద్దల చెరువు మినీ ట్యాంక్ బండ్‌కు కోట్లాది నిధులు విడుదల చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ ఊర రామమూర్తి యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు ముదిరెడ్డి రమణా రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి ధరావత్ వెంకన్న నాయక్, మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాసు గౌడ్, వల్దాసు దేవేందర్, యాట ఉపేందర్, పిల్లల రమేష్ నాయుడు, కుంచం అంజయ్య పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సూర్యాపేట అర్బన్ : మాట్లాడుతున్న సైదులు



నూతనకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కుసుకుంట్ల సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. లేబర్ కోడ్‌లతో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. బుధవారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, వెంకన్న, మల్సూర్, హరి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : కార్మికుల హక్కుల సాధనకు దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ, చిల్పకుంట్లలో సీపీఎంల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం, ఐఎఫ్‌టీయూ నాయకులు గంటా నాగయ్య, కందాల శంకర్‌రెడ్డి, బత్తుల జనార్దన్, కునుకుంట్ల సైదులు, దేసోజు మధు, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దగ్గుల మల్లయ్య, ఎస్‌కే బాబ్‌జానీ, మున్నా అశోక్, గంటా కార్తీక్ పాల్గొన్నారు.

నాగారం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏఐకేఎంఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపేట కాశయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక సమ్మెలో ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆయనతోపాటు ఏఐకేఎంఎస్ నాయకులు బయ్యం లింగయ్య, సంపేట కృష్ణమూర్తి, ధనుంజయ్, లింగారెడ్డి, గణేష్ తదితరులు ఉన్నారు.

అర్వపల్లి : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పూలే–అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఈదురు వీరపాపయ్య కోరారు. సమ్మె కరపత్రాలను మంగళవారం అర్వపల్లిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు నక్కల సురేందర్, నరసింహ, భిక్షం, కృష్ణయ్య, రమణ, వెంకటమ్మ, సైదులు, రాణి, వెంకట్రాములు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో..

సార్వత్రిక సమ్మె విజయవంతానికై అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురం తదితర గ్రామాల్లో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో వన మహోత్సవం

అర్వపల్లి : ప్రతి విద్యార్థి మొక్కలు నాటి వాటిని సంరక్షించడాన్ని అలవాటు చేసుకోవాలని మండల నోడల్ అధికారి, హెచ్‌ఎం కుంభం ప్రభాకర్ కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కర్కాని శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలి



మద్దిరాల : మాట్లాడుతున్న నారాయణరెడ్డి

మద్దిరాల : గ్రామ పంచాయతీ కార్యాలయాలలో రికార్డుల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీఓ కె.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ అయేషా ఫర్వీన్ మాట్లాడారు. ఈనెల 14న సీఎం రేవంత్‌రెడ్డి సభ ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మండలంలో పెండింగ్ సమస్యలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ రెడ్డి, ఏఓ అనిషా రూహి, ఏపీఎం మైసయ్య, ఎంఈఓ కాట్ల రవికుమార్, ఏపీఓ గుండు వెంకన్న, ఈసీ చారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాగారం : అధికారులు సమన్వయంతో పనిచేసి తిరుమలగిరిలో ఈ నెల 14న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని తహసీల్దార్ హరికిషోర్‌శర్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మారయ్య, ఎంఈఓ వాసం ప్రభాకర్, మండల వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, ఏపీఓ రవి, ఏపీఎం శోభారాణి, పీఆర్ఏఈఈ కుమారస్వామి, ఇరిగేషన్ ఏఈఈలు శ్రీకాంత్, హారిక, హౌసింగ్ ఏఈఈ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా ఇవ్వకుంటే సభను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న శ్రీకాంత్‌గౌడ్

మద్దిరాల : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందిన గౌడ కులస్తుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్స్‌గ్రేషియా విడుదల చేయకుంటే ఈనెల 14న జరిగే సీఎం సభను అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తొన్కునూరి రమేష్, మండల అధ్యక్షుడు రేసు వెంకన్న, జిల్లా నాయకులు గుండ్ల నాగయ్య, మద్దెల శ్రీను, మద్దెల అంజయ్య, ఆకుల రమేష్, గుండ్ల లింగయ్య, శిలివేరు సతీష్, మురళీగౌడ్, శిలివేరు లింగరాజు, మద్దెల మహేష్‌గౌడ్, తొట్ల లింగయ్య పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

తుంగతుర్తి: కుటుంబ పెద్ద మరణిస్తే ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం పొందేందుకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని గ్రామ కార్యదర్శి మడిపెద్ది శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఎన్ఎఫ్‌బీఎస్ ద్వారా బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థికసాయం అందుతుందని పేర్కొన్నారు. కుల సర్టిఫికెట్, ఆదాయం రూ.2లక్షల లోపు, ఆధార్ జిరాక్స్, రేషన్ కార్డు, డెత్ సర్టిఫికెట్, లాయర్ అఫిడవిట్ బాండ్ పేపర్, ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఆరోగ్యంపై అవగాహన

ఆత్మకూర్(ఎస్) : వృద్ధులు, క్యాన్సర్ పేషెంట్లు ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని పాలిటేకర్ డాక్టర్లు శ్వేత, సతీష్ అన్నారు. ఆలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నసీంపేట, ఆత్మకూర్, నెమ్మికల్ తదితర గ్రామాలలో అవగాహన కల్పించారు. డాక్టర్ల సలహా మేరకు మందులు వాడాలని, ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సల్వాది నిర్మల, ఆశా మణెమ్మ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా చూడాలి

ఆత్మకూర్ (ఎస్) : అర్హులైన వారందరిని ఓటర్ లిస్ట్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడారు. ఓటర్ లిస్ట్‌ల నమోదులో ఎలాంటి అవకతవకలు, తప్పులు లేకుండా చూసుకోవాలని బీఎల్‌ఓలకు సూచించారు.